క్లుప్తంగా

స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు



డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: ప్రజలకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు.

పాఠశాలకు ప్రింటర్ అందజేత



జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎంకు ప్రింటర్ అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం(పామూరు): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు పాఠశాల పూర్వ విద్యార్థులు కంప్యూటర్ ప్రింటర్, విద్యార్థులకు ఐడీ కార్డులు అందజేశారు. మండలంలోని అంబవరం పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు కొండూరు మునిరాజు, కొండూరు వెంకటరాజు తమ సొంతనిధులు రూ.25 వేలతో సమకూర్చిన కంప్యూటర్ ప్రింటర్, 227 మంది విద్యార్థులకు ఐడీ కార్డ్‌ను సమకూర్చి వాటిని పాఠశాల హెచ్ఎం షేక్.షరీఫ్ చేతుల మీదుగా అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



వెంకటయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

పీసీపల్లి: ఆటో తిరగబడి తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..ఈ నెల 11న కనిగిరి మండలం వెన్నపూస పల్లికి గ్రామానికి చెందిన వంగెవరపు వెంకటయ్య బంధువుల పెళ్లి చూపులు నిమిత్తం పీసీపల్లి వెళ్లి వస్తుండగా చింతలపాలెం సమీపంలో ఆటోబోల్తా పడి గాయపడ్డాడు. క్షతగాత్రున్ని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

బాల్య వివాహం అడ్డగింత



బాల్య వివాహాన్ని అడ్డుకుంటున్న అధికారులు

టంగుటూరు: స్థానిక బుడబుక్కల కాలనీలో బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే..బుడబుక్కల కాలనీలో బాల్య వివాహాలుజరుగుతున్నాయని గ్రామస్తులు, కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ పట్టించుకోలేదు. దీంతో ఇప్పటికే రెండు బాల్య వివాహాలు జరిగాయి. ఈ క్రమంలో గురువారం మరో బాల్య వివాహం జరుగుతుందన్న సమాచారాన్ని కాలనీవాసులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు హుటాహుటిన కాలనీకి చేరుకొని బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. అయితే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడే ఈ బాల్య వివాహాలు చేయిస్తున్నట్లు సమాచారం.

పొగాకు కనిష్ట ధర రూ.140



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో కనిష్ట ధర రూ.140 పలికింది. రోజు రోజుకు తిరస్కరణ బేళ్లు ఎక్కువవుతుండగా మరో పక్క కనిష్ట ధరలు దిగజారుతున్నాయి. గురువారం వేలానికి పాలేటిపాడు, జయవరం, ఆలకూరపాడు, రావివారిపాలెం, అనంతవరం గ్రామాలకు చెందిన రైతులు 1035 బేళ్లను తీసుకురాగా 884 బేళ్లను కొనుగోలు చేసి 151 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.281, కనిష్ట ధర రూ.140, సరాసరి ధర రూ.222.09గా నమోదైంది. వేలంలో 39 కంపెనీలు పాల్గొన్నాయి.

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర కేజీ రూ 245.77 పలికిందని వేలం నిర్వహణ అధికారి జి. సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని ధర్మవరం, వెంకటకష్టాపురం కోయవారిపాలెం తాటాకులపాలెం, ముక్కోడిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1025 బేళ్లను వేలానికి తీసుకురాగా 760 బేళ్లను కొనుగోలు చేసి 265 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.281, కనిష్ట ధర రూ.140గా నమోదైంది. 23 కంపెనీలు పాల్గొన్నాయి.



బస్టాండు ఆవరణలో చెత్త డంప్ చేసిన దృశ్యం



సింగరాయకొండ- బస్టాండులోని కాలువలో మురుగునీరు నిలిచిన దృశ్యం

సమస్యల స్టాండ్..!

- బస్టాండు ఆవరణ దుర్గంధభరితం
- తాగునీటికి దాతల సహకారమే దిక్కు
- బస్టాండ్‌లో తిరగని ఫ్యాన్లు
- వేలాది రూపాయలు అద్దె చెల్లిస్తూ కనీస వసతులు కల్పించలేదని దుకాణదారుల ఆవేదన
- రాత్రి పూట సెక్యూరిటీ లేకపోవటంతో ఆందోళనలో ప్రయాణికులు



సింగరాయకొండ ఆర్టీసీ బస్టాండు

సింగరాయకొండ:

నిత్యం రద్దీగా ఉండే సింగరాయకొండ ఆర్టీసీ బస్టాండ్ సమస్యలకు నిలయంగా మారింది. బస్టాండ్ ఆవరణ మొత్తం చిల్లచెట్లతో నిండిపోగా చుట్టుపక్కల దుకాణదారుల చెత్త అంతా బస్టాండ్ ఆవరణలో వేయటంతో డంపింగ్‌యార్డుగా తయారైంది. మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభంతో మహిళా ప్రయాణికుల రద్దీ పెరుగుతుందని మహిళల కోసం బస్టాండు ప్రాంగణంలో ప్రత్యేక వసతులు కల్పిస్తున్నామని గత కొద్దిరోజులుగా ఆర్టీసీ అధికారులు చేస్తున్న ప్రచారం కేవలం బూటకమని ప్రయణికులు ఆరోపిస్తున్నారు.

తాగునీటికి తంటాలు..

బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సత్యసాయి సమితి వారు బస్టాండ్లో కూలర్ పెట్టి మరీ మంచినీటిని కొద్ది రోజులు అందించారని, ప్రస్తుతం విశ్రాంత ఉద్యోగులు తాగునీరు అందిస్తున్నారు. పగటి వేళల్లో తాగునీరు అందుబాటులో ఉన్నా రాత్రిళ్లు లేకపోవడంతో ప్రయాణికుల అవస్థలు చెప్పేవీ కావు.

ముక్కు మూసుకోవాల్సిందే..

ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చుట్టుపక్కల దుకాణదారులు, మద్యం షాపుల వారు చెత్త తీసుకుని వచ్చి బస్టాండ్లో వేయటంతో పాటు మూత్ర విసర్జన చేయటంతో బస్టాండులోకి రావాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి. బస్టాండ్ ఆవరణ దుర్గంధం వెదజల్లుతోంది. బస్టాండ్‌లోని హోటల్ నుంచి వచ్చే మురికినీరు బయటకు పోయే వీలులేక ఆవరణలోనే నిలిచిపోవటంతో దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. బస్టాండ్ చుట్టుపక్కల అంతా పిచ్చిచెట్లతో నిండిపోయింది.

ఫ్యాన్లు ఉన్నా..లేనట్లే..

ఆర్టీసీ బస్టాండ్‌లో అరకొరగా ఫ్యాన్లు ఏర్పాటు చేయటంపై ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో బస్టాండ్ ఆధునీకరణ సమయంలో ప్రాంగణంలో పూర్తిస్థాయిలో ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. కాని ఇటీవల ఒంగోలు ఆర్టీసీ అధికారులు కరెంటు బిల్లు అధికంగా వస్తుందని సుమారు 12 ఫ్యాన్లు ఊడదీసి వేరే బస్టాండుకు తరలించారు. ఉన్న ఫ్యాన్లకు కూడా విద్యుత్ కనెక్షన్ తొలగించారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

కనీస వసతులు లేక ఇక్కట్లు..

బస్టాండ్ ప్రాంగణంలో వేలకు వేలు అద్దెకు ఉంటున్న దుకాణదారులకు కనీస వసతులు కల్పించటంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని షాపుల నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. కూల్‌డ్రింక్స్ షాపుకు నెలకు రూ.42 వేలు అద్దె చెల్లిస్తున్నారు. కానీ బస్టాండ్‌కు కాస్త దూరంలో షాపు ఉండటంతో వాటిని తీసుకువచ్చి బస్టాండ్ ప్రాంగణలో విక్రయిస్తే అధికారులు జరిమానా విధిస్తున్నారని వాపోతున్నారు. మరుగుదొడ్ల నిర్వాహకులు అయితే బోరు లేక ప్రతిరోజు రూ.450 చొప్పున ట్యాంకర్ నీరు కొనుగోలు చేయాల్సి వస్తోందంటున్నారు. బస్టాండ్ ఆవరణలో బోరు వేస్తే మాతో పాటు, హోటల్ నిర్వాహకులకు ఎంతో సౌకర్యంగా ఉండటంతో పాటు అదనపు భారం తగ్గతుందంటున్నారు.



బస్టాండ్లో అరకొరగా ఉన్న ఫ్యాన్లు



బస్టాండులో విరిగిపోయిన ఇనుప బల్లలు

ప్రయాణికుల భద్రత గాలిలో దీపమే..

బస్టాండ్ చుట్టుపక్కల ప్రాంతమంతా రాత్రిళ్లు మందుబాబుల నిలయంగా మారాయి. దీంతో రాత్రిళ్ల మహిళలు బస్టాండ్‌లో వేచి ఉండాలంటే భయపడే పరిస్థితి. పోలీసులు రాత్రి పూట పెట్రోలింగ్ వచ్చి బుక్‌లో సంతకం పెట్టి దుకాణదారుల వద్ద వాటర్ బాటిల్ తీసుకుని వెళతారే తప్ప మందుబాబులను పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ప్రయాణికుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవటంతో పాటు అన్ని రకాల వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి



మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పామూరు: ఒంగోలులో ఈనెల 20 నుండి 25వ తేదీ వరకు జరగనున్న సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ మౌలాలి అన్నారు. స్థానిక గుజ్జుల యల్లమందారెడ్డి భవన్‌లో గురువారం సీపీఐ జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహాసభలను పురస్కరించుకుని ఈ నెల 20 నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో కళా ఉత్సవాల పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. చట్టసభల్లో ప్రజాపక్షాన నిలిచే ప్రజాప్రతినిధులు లేకపోవడం విచారకరమన్నారు. దేశంలో దామాషా ప్రకారం ఎన్నికల ప్రక్రియను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కొల్లగొట్టే వారికి రక్షణ కవచంలా పనిచేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్ట్‌పై మొద్దునిద్ర వీడి ఇప్పటికైనా పూర్తిచేసి సాగు, తాగునీరు ఇచ్చేలా చూడాలన్నారు. మండల కార్యదర్శి పోతల ప్రభాకర్, వజ్రాల సుబ్బారావు, రాగిపాటి సూరిబాబు, పి.మస్తాన్‌రావు, రఘునాథరెడ్డి, మహేష్, దేవకుమార్, జిలానీ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు



ఆలయంలో ప్రత్యేక పూజలు



ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం

కనిగిరిరూరల్: మండలంలోని లింగారెడ్డిపల్లిలో ఐదు రోజులుగా జరుగుతున్న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి, పరివార దేవతా ప్రతిష్టా మహోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. గురువారం ధ్వజ స్తంభం ప్రతిష్టా మహోత్సవం భక్తిశ్రద్ధలతో, నియమ నిష్టలతో నిర్వహించారు. ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, యంత్ర స్థాపన, విగ్రహ స్థాపన, మహా పూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్టా, దృష్టి కుంభం, గోదర్శనం, శాంతి కళ్యాణం, కంకణ విమోచన, మహదాశీర్వాచనం, పండిత సత్కారం కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దల పర్యవేక్షణ, ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

వాలీబాల్ పోటీలకు చాకిచర్ల విద్యార్థులు

ఉలవపాడు: రాష్ట్రస్థాయి అండర్-15 స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీలకు చాకిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ అధ్యాపకుడు ఓగుబోయిన శ్రీనివాసులు తెలిపారు. పదో తరగతి చదువుతున్న బి.రాజేష్, వి.మహేష్‌లు ఎంపికయ్యారు. బుధవారం త్రోవగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపడంతో ఎంపిక చేశారు. వీరు ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు జనార్దన్‌రావుతో పాటు గ్రామస్తులు అభినందించారు.

ఫ్లోరోసిస్ నివారణపై అవగాహన



ఫ్లోరైడ్ గురించి వివరిస్తున్న డాక్టర్ దివ్య

లింగసముద్రం: జాతీయ ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ అధికారి డాక్టర్ దివ్య వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఏయే గ్రామాల్లో నీటిలో ఫ్లోరైడ్ ఎంత శాతం ఉందో టెస్ట్ చేయాలన్నారు. ఫ్లోరైడ్ ఉన్న నీటిని తాగితే జరిగే నష్టం వివరించారు. రక్షిత మంచి నీరు మాత్రమే వాడాలన్నారు. ఫ్లోరైడ్ లేని పేస్టులనే వాడాలని సూచించారు. అనంతరం తిమ్మారెడ్డిపాలెంలో ఫ్లోరోసిస్ గురించి ఇంటింటికీ తిరిగి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సీహెచ్ఓ జి.శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



పామూరులో జాతీయ జెండాలతో ర్యాలీ

పామూరు: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తి చాటాలని పామూరు మేజర్‌పంచాయతీ పీఎస్ గవిరెడ్డి అరవిందారెడ్డి, బీజేపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేవీ రమణయ్య అన్నారు. హర్ ఘర్ తిరంగా లో సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం మీదుగా ప్రధాన వీధుల్లో త్రివర్ణ పతాకాలను చేతపట్టుకుని ర్యాలీ నిర్వహించారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

టంగుటూరు: మండలంలోని అనంతవరం పంచాయతీలో జంగిల్ క్లియరెన్సు పనులు చేయకుండానే నిధులు డ్రా చేశారని, దీనిపై సమగ్రంగా విచారించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. పంచాయతీ పరిధిలో పరిధిలోనే పసుకుదురు, తాళ్లపాలెం, తేటుపురం గ్రామాల్లో జంగిల్ క్లియరెన్స్, డ్రైనేజీలు, వీధిలైట్లు, తాగునీటి పేరుతో కాగితాలు సృష్టించి ఎక్కడా పనులు చేయకుండానే గత నెలలో పంచాయతీ నిధులు దోచుకున్నారు. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో పంచాయతీ కార్యదర్శి, టీడీపీ నాయకుల అక్రమాలు బయటకు వస్తాయని హడావుడిగా తూతూమంత్రంగా పనులు చేసి రికార్డులు తారుమారు చేశారు. దీనిపై పంచాయతీలోని పసుకుదురు గ్రామస్తుడు సురేష్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అదే విధంగా తేటుపురం గ్రామస్తులు మర్రి భాస్కర్‌రెడ్డి, అర్జున్‌లు సైతం ఎంపీడీఓదేవకుమారికి ఫిర్యాదు చేశారు. నిధుల దుర్వినియోగంపై సమగ్రంగా విచారణ చేయాలని వినతిపత్రం అందజేశారు. అయితే దీనిపై అధికారులు ఇప్పటి వరకు ఎటువంటి విచారణ చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

అభయాంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు



ఆలయంలో బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, దద్దాల పూజలు

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్‌లు గురువారం పట్టణంలోని కొత్తూరు అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ శ్రేణులు బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డిని దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, ఒకేరెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు తమ్మినేని సుజాతరెడ్డి, జీ బొర్రారెడ్డి, మూలే గోపాల్‌రెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, లేళ్ల కృష్ణారెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, కటికల వెంకట రత్నం, సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, మూలే రాజశేఖరరెడ్డి, ముల్లంగి శ్రీహరిరెడ్డి, వాకమళ్ల రాజశేఖరరెడ్డి, బత్తుల మాలి పాల్గొన్నారు.

అతివేగంతో వాహనాలు నడిపితే చర్యలు



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

కనిగిరిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా అతి వేగంతో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ హెచ్చరించారు. గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అధిక వేగంతో, నిబంధనలు పాటించని వాహనాలను గుర్తించి, కేసులు నమోదు చేశారు. అనంతరం వాహన డ్రైవర్లకు, యువకులకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అధిక వేగం వలన కలిగే నష్టాలు, ప్రమాదాలు, వాటి పర్యవసానాల గురించి వివరించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. బైక్‌లు నడిపేటప్పుడు నిర్దేశిత వేగపరిమితి పాటించాలని, ట్రాఫిక్స్ రూల్స్ పాటించాలని తల్లిదండ్రులు తమ పిల్లలకు సూచనలు చేసి, పర్యవేక్షణ చేయాలని చెప్పారు. నిబంధనలు విస్మరించినా.. వేగంగా బైక్‌లు నడిపినా తీవ్ర చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీఐ ఎస్కే ఖాజావలి, ఎస్సైలు మాధవరావు, శ్రీరాం, కోటయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



వాల్ పోస్టర్‌లు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

కనిగిరిరూరల్: పాలనలు సాగిస్తున్న ప్రభుత్వాల వైఫల్యాలపై ప్రశ్నిద్దాం.. మహాసభల్లో పాల్గొని గొంతుకు గొంతు కలిపి పాలకులను నిలదీద్దాం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై రవీంద్ర బాబు, ఏఐటీయూసి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసీన్‌లు పిలుపునిచ్చారు. స్థానిక దరిశి చెంచయ్య భవన్‌లో గురువారం సీపీఐ 28వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించి, పట్టణంలో కరపత్ర ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వై రవీంద్రబాబు మాట్లాడుతూ వందేళ్ల సుదీర్ఘ పోరాట చరిత్ర కల్గిన సీపీఐ తొలి సారిగా రాష్ట్ర మహాసభలను ఒంగోలు నగరంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 20వ తేది నుంచి 25వ తేదీ వరకు జరిగే మహాసభలకు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. ఏఐటీయూసి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసీన్ మాట్లాడుతూ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, రామాయపట్నం ఓడరేవు, దొనకొండ పారిశ్రామిక కారిడార్, నిమ్స్, ఒంగోలు పాల డైరీ పునః ప్రారంభం, ట్రిపుల్ ఐటీ, పేదలకు భూమి పంపిణీ, జిల్లా సమగ్రాభివృద్ధికి సీపీఐ రాజీలేని పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి పందిటి మోహన్, గులాం హుస్సేన్, మీరావలి, గుజ్జుల బాలిరెడ్డి, జమ్మ, బషీరా, ఇఫ్రాజ్, తాహీద్, వెంకటేశ్వర్లు, నారాయణ, ఖాశిం, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి పొగాకు బ్యారెన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం



సునీల్‌కుమార్

కొండపి: 2025-26 సంవత్సరానికి పొగాకు రిజిస్ట్రేషన్లు 18వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. స్థానిక వేలం కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది నుంచి మూడేళ్లకు ఒకసారి మంజూరు చేస్తామన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి మూడేళ్లకు సాగు ప్రణాళిక చేపట్టాలన్నారు. బోర్డులో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు మాత్రమే పొగాకు సాగు చేయాలని తెలిపారు. రైతులు కేటాయించిన కోటా మేరకే పంట పండించాలని, అధిక విస్తీర్ణంలో నాటడం, పండించడం చేయకూడదని సూచించారు. అనధికారికంగా బ్యారెన్లు నిర్మించవద్దని, రిజిస్టర్ అయిన రైతులు అనధికారికంగా బ్యారన్ నిర్మాణం చేపడితే వారి రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది 142 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి మాత్రమే అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. అక్టోబర్ 22 వరకు అపరాధ రుసుం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, రూ.100 అపరాధ రుసుంతో నవంబర్ 7 వరకు, రూ.400 అపరాధ రుసుంతో నవంబర్ 19 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఎఫ్‌సీవీ పొగాకు విత్తనాలు కందుకూరు, రాజమండ్రి ఎన్ఐఆర్‌సీఏ(సీటీఆర్‌టీ) వద్ద విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు బోర్డు, ఎన్ఐఆర్‌సీఏ సిఫార్సులు చేసిన అధిక దిగుబడినిచ్చే వంగడాలు మాత్రమే సాగుకు ఎంచుకోవాలని, లేకుంటే వారి లైసెన్సు పునరుద్ధరణ నిలుపుదల చేస్తామన్నారు. రైతులు శనగ, మొక్కజొన్న, కంది, మిరప వంటి పంటలు పండించడం ద్వారా ప్రతికూల వాతావరణ పరిస్థితులు మార్కెట్‌లో ఒడిదుడుకులు ఎదురైనప్పుడు రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చన్నారు. లోగ్రేడ్ పొగాకు ఉత్పత్తి తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వరి వేసిన భూముల్లో పొగాకు ఎట్టి పరిస్థితుల్లో సాగు చేయరాదని సూచించారు.